క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎస్సైగా మస్తానయ్య

పొదలకూరు : పొదలకూరు ఇన్‌చార్జి ఎస్సైగా నెల్లూరు రూరల్ ఎస్సై మస్తానయ్య బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ ఎస్సై కరిముల్లా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. ఆయన సెలవు రద్దు చేసుకుని వచ్చే అవకాశం లేకపోవడంతో మస్తానయ్యను ఇన్‌చార్జిగా నియమించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ఆలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో పరిశీలిస్తున్న ఎంఈఓ

కొడవలూరు : మండలంలోని ఆలూరుపాడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ–1 జి.వసంతకుమారి బుధవారం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూ కచ్చితంగా అమలు చేస్తున్నారా.. లేదా? అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరాతీశారు. విద్యార్థుల నోట్సులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట హెచ్‌ఎం ఎం.వెంకటేశ్వర్లు సీఆర్‌ఎంటీలు పులి రమేష్, ములి దయాకర్ ఉన్నారు.

చెన్నకేశవుని ఆశీస్సులు సీఎం జగన్‌కు ఉండాలి



స్వామి ఆశీర్వచనం తీసుకుంటున్న మంత్రి కాకాణి

వెంకటాచలం : చెన్నకేశవస్వామి ఆశీస్సులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కనుపూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కుంభాభిషేక మహోత్సవంలో బుధవారం రాత్రి మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ద్వారా రూ.10 లక్షల నిధులు, గ్రామస్తుల సహకారంతో కనుపూరు గ్రామంలో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించుకోవడం చాలా సంతోషకరమన్నారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందుల వెంకటశేషయ్య, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్ లా కళాశాలలో అడ్మిషన్లు చేపట్టాలని వినతి



నెల్లూరు (దర్గామిట్ట): నెల్లూరులోని వీఆర్ లా కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు నిర్వహించకుండా ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుందని, దీని వల్ల న్యాయ విద్యకు విద్యార్థులు దూరమవుతారని, యథావిధిగా అడ్మిషన్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓకు బుధవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా మొత్తానికి ఒకే లా కళాశాల ఉందని, ఎంతో మంది విద్యార్థులు న్యాయ విద్యను అభ్యసించాలని ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఇలాంటి సమయంలో విద్యామండలి వీఆర్ లా కళాశాలను బ్లాక్‌లిస్టులో పెట్టి అడ్మిషన్లు ఆపేస్తే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు యథావిధిగా జరిగేలా చూడాలని కోరారు. నగర సహాయ కార్యదర్శులు నరసింహ, సుమన్, సమీర్, విద్యార్థి నాయకులు నవీన్, వినోద్, సుకుమార్ పాల్గొన్నారు.

వీపీఆర్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం

నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని పలువురు యువత పేర్కొన్నారు. బుధవారం ఎంపీ వేమిరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సాయిభాస్కర్‌రెడ్డి, షేక్ నూర్ కళందర్, షేక్ షబ్బీర్, రాధాకృష్ణ, దండికట్టు శివప్రసాద్, మార్క్ మస్తాన్, కే కృష్ణ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరు, రాంనగర్, పొదలకూరురోడ్డు కాలనీ, బుచ్చి, కోవూరు, దామరమడుగు, బోడిగాడితోటకు చెందిన పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. వేమిరెడ్డిని గజమాలతో ఘనంగా సత్కరించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపునకు శాయశక్తుల కృషి చేస్తామని పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



11 కేవీ ఫీడర్ బ్రేకర్, నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఎంపీ వేమిరెడ్డి పక్కన మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వరిగొండ పంచాయతీకి విద్యుత్ సరఫరా అందించేందుకు వావిలేటిపాడు సమీపంలో నూతనంగా నిర్మించిన 11 కేవీ ఫీడర్ బ్రేకర్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తితో కలిసి మంత్రి కాకాణి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తోటపల్లిగూడూరు మండల వరిగొండ పంచాయతీకి దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ సమస్యకు చెక్ పెట్టేందుకు వావిలేటిపాడు వద్ద రూ.56.75 లక్షలతో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.10 లక్షలతో 11 కేవీ ఫీడర్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా దీర్ఘకాలంగా వరిగొండ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య తొలగిపోనుందన్నారు. అలాగే నియోజకవర్గంలో లో–ఓల్టేజీ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన ప్రతిచోట విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలను చేపట్టి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధి

సర్వేపల్లి నియోజకవర్గం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తోందని మంత్రి కాకాణి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నిరంగాలపై ఎలా దృష్టి సారించామో విద్యుత్ సరఫరా విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకొంటున్నామన్నారు. విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే పరిశ్రమలకు కొంత కోత విధించి సాధారణ వినియోగదారులకు పూర్తి స్థాయిలో విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కావల్‌రెడ్డి రంగారెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, కోసూరు రవీంద్రయ్య, నెల్లిపూడి సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

- సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

వెంకటాచలం : జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చిన వ్యక్తులు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి సూచించారు. మండలంలోని చెముడుగుంట వద్దనున్న జిల్లా కేంద్ర కారాగారంలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ముందుగా జైలులో ఉన్న ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. తెలిసీ, తెలియక చేసిన తప్పులు మళ్లీ చేయవద్దని సూచించారు. జైలు జీవితం అనుభవించి బయటకు వెళ్లిన తరువాత కుటుంబసభ్యులతో అన్యోన్యంగా జీవించాలని తెలియజేశారు. లాయర్లు అవసరమైన వారికి ఉచితంగా ఏర్పాటు చేస్తామని, ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ సదస్సులో జైలు సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, జైలర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య



మాట్లాడుతున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంపై వెంకటాచలంలోని గ్రామ సచివాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని రీతిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పరిపాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని కొనియాడారు. ఈ విషయంలో మారుమూల ఉన్న గ్రామాల్లోని ప్రజలకు సైతం తెలియజేయాలనే ఆలోచనతో ఆ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, తప్పక హాజరుకావాలని కోరారు.

భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు గ్రామంలో భద్రకాళి పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం రాత్రి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల దసర శరన్నవరాత్రుల సందర్భంగా తొమ్మిరోజుల పాటు ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో గత రాత్రి భక్తులు అమ్మవారికి 16 రోజుల పండగ నిర్వహించి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

'ఆడుదాం ఆంధ్ర'కు క్రీడా స్థలం పరిశీలన



క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న పరిశ్రమల శాఖ జీఎం సుధాకర్

కోవూరు : 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు సంబంధించి అనువైన క్రీడా మైదానాల కోసం పరిశ్రమల శాఖ జీఎం కేపీ సుధాకర్, ఎంపీడీఓ శ్రీహరితో కలిసి బుధవారం కోవూరు పరిధిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్‌లో జరుగనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలకు సంబంధించి క్రికెట్, వాలీబాల్, షటిల్, ఖోఖో, కబడ్డీ పోటీలకు మండలంలో అనువైన క్రీడా మైదానాలను పరిశీలించినట్లు తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, వశిష్ట ఆంగ్ల మాధ్యమ పాఠశాల, గుమ్మళ్లదిబ్బలోని ఉన్నత పాఠశాల, పాటూరు ఉన్నత పాఠశాలలోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ దేవిక గీతామాధురి ఉన్నారు

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌పీ

పొదలకూరు : పొదుపు మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రభుత్వం వివిధ పథకాలను ప్రవేశపెడుతోందని, అందులో భాగంగానే డ్వాక్రా సంఘాలకు వ్యక్తిగత రుణాలను మంజూరు చేస్తున్నట్లు ఫుడ్ ప్రాసెసింగ్ డీఆర్‌పీ భానుచంద్ర అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ఏపీఎం రోజ్‌మేరీ ఆధ్వర్యంలో ఉమెన్ లీడ్ ఎంటర్‌ప్రైజెస్ లబ్ధిదారులకు ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీ మాట్లాడుతూ మహిళలు వ్యక్తిగతంగా ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బ్యాంకు రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపు మహిళలు రుణాలను తీసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభించాల్సిందిగా సూచించారు. మహిళలు వ్యక్తిగతంగా యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలంటే 85550 73198 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాల్సిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో పొదుపు మహిళలతో పాటు, సీసీ కూడా పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎంఈఓ శేషాద్రివాసు

మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించడంపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని పశువులను కట్టివేయడం, మురుగు నీరు వదలడం లాంటి పనులు చేస్తున్నారన్నారు. దీనివల్ల పాఠశాల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, పిల్లలు రోగాల బారిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎంఈఓ పరిశీలన

గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో ఎంఈఓ శేషాద్రివాసు మడమనూరులోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించాలని హెచ్‌ఎం స్నేహలతకు సూచించారు. ఆయన వెంట ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఆదిశేషయ్య ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..



ఎమ్మెల్యే ప్రసన్నకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ

కోవూరు : కోవూరు సీఐగా బాధ్యతలు చేపట్టిన దాసరి వెంకటేశ్వరరావు దంపతులు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాంతి భద్రతల గురించి చర్చించారు

అభినందన

కోవూరు సర్కిల్ కార్యాలయంలో సీఐగా బాధ్యతలు చేపట్టిన డి.వెంకటేశ్వరరావును డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, పడుగుపాడు ఉపసర్పంచ్ షేక్.అహ్మద్, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలతతో పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శ



కొడవలూరు : మండలంలోని గండవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అడపాల మోహనకృష్ణ సతీమణి రజని అనారోగ్యంతో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా, స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ఆమెను పరామర్శించారు. అదేవిధంగా రెడ్డిపాళేనికి చెందిన నీలకంఠం శ్రీధర్‌రెడ్డి ప్రమాదానికి గురై శస్త్రచికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను కూడా ఎమ్మెల్యే ప్రసన్న పరామర్శించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి రావు, వైఎస్సార్‌సీపీ నేతలు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, ముజీర్‌బాషా ఉన్నారు.

నేడు విడవలూరులో 'ఏపీకి జగనే ఎందుకు'

విడవలూరు : మండల కేంద్రంలోని అంకమ్మ దేవాలయం సెంటర్‌లో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం గురువారం జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరణ జరుగుతుందని తెలియజేశారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

నేడు లేబూరులో ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పర్యటించనున్నారని ఏపీ ఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సిమెంటురోడ్లను ప్రారంభించడంతో పాటు, రైతులకు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తారని చెప్పారు.

అయ్యప్పస్వామికి పూజలు

పొదలకూరు : పట్టణంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో అయ్యప్పభక్తులు 46వ అంబళపూజను బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అయ్యప్పమాలలు ధరించిన గురుస్వాములు, భక్తులు కలిసి స్వామి పాటలను ఆలపించి పడిపూజ చేశారు. పట్టణంలోని భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా దేవస్థానానికి రంగురంగుల విద్యుద్దీపాలంకరణ గావించారు. అయ్యప్పసేవా సమితి పూజా ఏర్పాట్లను చేశారు.

దుకాణదారులు తగిన జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

కోవూరు : దీపావళి పర్వదినం సందర్భంగా కోవూరు సర్కిల్ పరిధిలోని కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో బాణసంచా దుకాణదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోవూరు సీఐ డి.వెంకటేశ్వరరావు సూచించారు. కోవూరు సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిబంధనలకు తగ్గట్లు షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఎక్కడైనా అక్రమంగా బాణసంచా తయారు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. షాపు ఉండే ప్రాంతంలో అగ్నిమాపక యంత్రాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇసుక, నీరు దగ్గరలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎస్సై రంగనాథ్‌గౌడ్, ఇందుకూరుపేట ఎస్సై రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎండీఎం ఆపరేటర్‌పై కేసు నమోదు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు గ్రామంలో ఎండీఎం ఆపరేటర్‌పై కేసు నమోదైంది. ఎస్సై మహేంద్ర కథనం మేరకు.. మినగల్లు అరుంధతీయవాడలో పేదలకు రేషన్ సరుకులను సరఫరా చేసే వాహనంలో 223 కిలోల బియ్యం, 263 చక్కెర ప్యాకెట్లు, 49 కిలోల గోధుమ ఎక్కువ కలిగి ఉన్నారని గుర్తించి పౌరసరఫరాల డీటీ మురళి బుధవారం దాడులు చేసి పట్టుకున్నారు. నిందితుడు ప్రకాశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు : గ్రామంలో శుక్ర, శనివారాల్లో జరుగనున్న 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం కోరారు. నార్తురాజుపాళెం సచివాలయంలో వలంటీర్‌లతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వలంటీర్‌ల పాత్ర కీలకమన్నారు. ప్రతిఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ వారికి ఏం చేశారో స్పష్టంగా వివరించాల్సి ఉంటుందన్నారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, అధికారులు, నేతల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి జాలయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగదేవిపేటలో వ్యవసాయ విద్యార్థులు



దుక్కిదున్నడాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ఇందుకూరుపేట : గ్రామీణ వ్యవస్థాపక అవగాహన అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగదేవిపేట గ్రామంలో శ్రీవెంకటేశ్వర విద్యాలయం(తిరుపతి) విద్యార్థులు క్షేత్ర పరిశీలన చేపట్టారు. నాలుగు నెలలపాటు గ్రామంలో నివాసం ఉంటూ రైతులతో మమేకమై వ్యవసాయ విధానాలను తెలుసుకోవడం, రైతులకు సూచనలు సలహాలు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని విద్యార్థులు తెలిపారు. అందులో భాగంగా బుధవారం నారుమడిని దుక్కిదున్ని సిద్ధం చేయడం, కూరగాయల పంటలకు దుక్కిని తయారు చేసుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు విద్యార్థులు వెల్లడించారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్



మాట్లాడుతున్న లవకుమార్‌రెడ్డి

మనుబోలు : గ్రామాల్లో ఇంటింటికీ జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయి కనెక్షన్‌లు ఇస్తున్నామని జల్ జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ లవకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బండేపల్లి, జట్లకొండూరు గ్రామాల్లో హర్ ఘర్ జల్ ఉత్సవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి సగటున రోజుకు 55 లీటర్ల పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారని తెలిపారు. ఈ లక్ష్యం 2024 నాటికి పూర్తవుతుందన్నారు. మండలంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా మొదటి విడతలో రూ.2.44 కోట్లు, రెండో విడతలో 36 గ్రామాలకు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి రూ.14.60 కోట్ల నిధులు కేటాయించామన్నారు. జట్లకొండూరులో రూ.19.68 లక్షలతో తాగునీటి వసతి కల్పించినట్లు తెలిపారు. జట్లకొండూరు గ్రామాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా ప్రకటించినట్లు తెలిపారు. దీనికి రూ.147 లక్షల నిధులు మంజూరై ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి, ఈఓపీఆర్డీ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి రాజ తదితరులు పాల్గొన్నారు.

సోమిరెడ్డీ.. చవకబారు విమర్శలు మానుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయశాఖపై టీడీపీ నేత సోమిరెడ్డి చేస్తున్న చవకబారు విమర్శలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు అన్నారు. మండలంలోని కోవెరపాళెంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత టీడీపీ పాలనలో రైతులు ఎన్నడూ సుఖపడింది లేదన్నారు. ఉచిత విద్యుత్ విషయంలోనూ రైతులను దగా చేసిన వైనం నేటికి రాష్ట్ర ప్రజలు మరిచిపోరన్నారు. గత టీడీపీ పాలనలో రైతు సంక్షేమానికి చేసిన ఖర్చుతో పోలిస్తే రెండింతలు ప్రస్తుత ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలోనూ అంతే మిన్నగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందని వివరించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అడ్డగోలు విమర్శలు చేయడం తగదన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి విషయంలో నాటి టీడీపీ ప్రభుత్వం, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన కృషిపై చర్చకు వస్తానంటే తాము సిద్ధంగా ఉన్నామని సోమిరెడ్డికి సవాల్ విసిరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంపై, మంత్రి కాకాణిపై విమర్శలు మాని హుందాగా వ్యవహరించాలని సోమిరెడ్డికి హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, మాజీ సర్పంచ్ తలమంచి రామయ్య, పార్టీ నేతలు గంగపట్నం గురునాథం, జి.భూషితలింగం, అన్నం మస్తానయ్య, ముత్యాల సుధాకర్ పాల్గొన్నారు.